అర్థరాత్రి... సమయం పన్నెండు గంటలు కావస్తూంది.

ఊరు చివర.. అంతా బంజరు బయలు ప్రదేశం.

ఎత్తుగా వున్న రైలు కట్టకి ఒక ప్రక్కగా పాలు పోసుకొంటున్న వరిచేలు వేరొక ప్రక్కగా దట్టంగా పెరిగిన చెట్లు చేమలు..

"ఎర్రగణపారం" అనే చిన్న గ్రామం అది.

రైలుస్టేషన్ నుంచి పంట చేల గట్ల మీదుగా మూడు కిలోమీటర్లు నడిస్తేగాని ఊరు తగలదు.

పంట చేలకి అవతల వైపుగా సన్నని ఎర్రటి మట్టి రోడ్డుకూడా వుంది.రైతుల ఎడ్ల బళ్ళు సైకిళ్ళు, పాలకావిళ్ళు వగైరాలన్నీ ఆ దారిగుండానే పోతాయి. కాని అది కాస్త చుట్టు తిరుగుడు.

సరిగ్గా పావు గంట క్రితం ఎర్రగణపారం రైలు స్టేషన్లో ఆగిన పాసింజరు బండి స్టేషన్ వదిలి చాలా సేపయ్యింది.

కాని–

ఆ రైలుదిగిన కుమారి హిమజ మాత్రం ఒంటరిగా – పిచ్చిదానిలా – సంధించి విడిచిన బాణంలా ఆ రైలు కట్ట వెంబడి అలాపరిగెడుతూనే వుంది. దానికి తోడు ఎదురుగాలి.

రైలు పట్టాలకి అటు ఇటు గుట్టలుగా పడివున్న కంకర్రాళ్ళ మీంచి పరిగెట్టి పరిగెట్టి అలసిపోతూంది. చెప్పులు ఎప్పుడో తెగిపోయాయి. కోరగా వున్న కంకర లేత తమలపాకుల్లాంటి ఆమె పాదాలని చీరుకొని ఎర్రగా రక్తం ఓడుతున్నాయి.

చేతిలోని సూట్‌కేస్ ఎప్పుడు ఎక్కడ జారిపోయిందో కూడా ఆమెకి స్పృహ లేదు.

చీర కుచ్చెళ్ళు జారి కాళ్ళకి బందాలు పడుతూ పరుగుకి అవరోధం కల్పిస్తుంటే చీరని విప్పి చేత్తుల్తో పట్టుకుంది. ఇరవై నాలుగేళ్ళ నవయవ్వనవతి హిమజ ఆ అర్థరాత్రి పరికిణీ జాకట్టుతో అలా రైలు కట్ట వెంటబడి పరిగెడుతూంది.

నల్లగా పోతపోసిన విగ్రహాల్లా – ఆ చీకట్లో యమకింకరులేమో అన్న భ్రమ కలిగించేలాంటి – నల్గురు వస్తాదుల్లాంటి రౌడీలు పెదాల మధ్య బీడీ దమ్ము బిగగట్టి లుంగీలు పైకి ఎగగట్టి ఆమె వెంట పరిగెడుతున్నారు.

ఘాటుగా తాగిన నాటుసారా కిక్కు ఎక్కడ దిగిపోతుందో అన్నట్టు అంత హడావుడిల్లోనూ ఒక నిమిషం ఆగి బనీను జేబుల్లోంచి సారా సీసా బయటికి తీసి రెండు గుక్కిళ్ళు నోట్లో పుక్కి పట్టి తిరిగి పరుగు లంకించుకుంటున్నారు.

హిమజకి వాళ్ళకి మధ్య సుమారు ఇరవై గజాల దూరం మాత్రమే వుంది.

ఎర్రగణపారం పల్లెటూరు. ఆ ఊరికి రోజు మొత్తం మీద ఒకే ఒక్క పాసింజరు బండి ఆగుతుంది. నిజానికి ఆ బండి రాత్రి ఎనిమిది గంటలకి స్టేషన్ చేరాల్సి వుంది. కాని ఆ రోజు మూడుగంటలు పైగా బండి లేటు. లెవల్ క్రాసింగ్ హిమజ. తండ్రి చనిపోయాడు. తల్లి,ఇద్దరు చెల్లెళ్ళు, తమ్ముళ్ళ బాధ్యత ఆమెపై పడింది. చదువుల దృష్ట్యా వాళ్ళందర్ని పట్నంలో వుంచి తను మాత్రం ఒంటరిగా ఎర్రగణపారంలో వుంటోంది. ట్రాన్సఫర్ కోసం ప్రయత్నిస్తూంది. క్రిందటి వారంలో మూడు రోజులు పండుగ సెలవులు వస్తే మరో రెండు రోజులు కలిపిసెలవు పెట్టి పట్నం వెళ్ళి తన వాళ్ళతో గడిపింది. ఈ రోజు తిరుగు ప్రయాణం అయ్యింది. బండి గణపారం వెళ్ళేసరికి ఎనిమిది గంటలు అవుతుంది. రైతుల ఎడ్లబళ్ళుపోతూ వుంటాయి. ఊళ్ళోకి ఆ బండి మీద వెళ్ళి పోవచ్చు అనుకుంది.

కాని ఏ దుష్ట ముహూర్తంలో బయలుదేరిందో పరిస్థితి ఎదురు తిరిగింది. మూడున్నర గంటల పైగా బండి లేటవడంతో ఒంటరిగా పదకొండున్నర ప్రాంతంలో ఆ చీకట్లో అర్థరాత్రి రైలు దిగింది.

ఒంటరిగా సూట్‌కేస్ పట్టుకొని రైలు దిగి దిక్కుతోచని దానిలా చీకట్లో నిల్చున్న హిమజ దగ్గరగా గప్పున సారా కంపు కొడుతుంటే త్రుళ్ళి పడింది.

ఎవరో నలుగురు రౌడీలు. ఎర్రని కళ్ళతో బీడీలు తాగుతూ ఆమె వైపే చూస్తూ నిల్చున్నారు.

స్టేషన్లో వెలుగుతున్న లైటు వెలుగులో వాళ్ళని చూసిన హిమజ గుండె ఆగిపోయింది.

బహుశా వాళ్ళు కూడా ఆ రైలెదిగి వుంటారు.

పల్లెపట్టులు ప్రశాంతతకి నిలయాలు అంటారు. కాని అక్కడ చెలరేగే దొమ్మీ, క్రీడా రాజకీయాలు.. చూసేవాళ్ళకే అర్థం అవుతుంది. పైగా ఎలక్షన్స్ రోజులు. బహుశా అటువంటి దేదన్నా పని మీదే వచ్చి వుంటారు ఈ రౌడీలు. తను వాళ్ళకంట పడింది.

వాళ్ళని చూడగానే హిమజ ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. అప్పటికే స్టేషన్ మాస్టర్ సైకిల్ తీసి బయట పెట్టాడు. ఇంక ఆ రాత్రికి బళ్ళేం లేకపోవటంతో గదికి తాళం వేసే ప్రయత్నంలో వున్నాడు. హిమజ లేడిలా గెంతినట్లు ఆయన దగ్గరకి వెళ్ళి ఏదో చెప్పింది. రౌడీలు ఆమె వెంట పడ్డారు.

పరిస్థితి అర్థం చేసుకున్న స్టేషన్‌మాస్టరు వాళ్ళని నివారించబోయాడు. కాని మూర్ఖుడి ముందు సుభాషితాలు పనిచేస్తాయా? వాళ్ళ చేతుల్లోని కర్రలు బలంగా స్టేషన్ మాస్టరు తల మీద నాట్యం చేశాయి. అప్పటికే హిమజ పిచ్చిపట్టిన దానిలా రైలు కట్ట వెంబడి పరిగెత్తసాగింది.

వాళ్ళు ఆమె వెంట పడ్డారు.

కంకర్రాళ్ళ గుట్టలు, ముళ్ళ డొంకలు దాటుకొంటూ ఆమె వేగంగా పరిగెడుతూనే వుంది.

ఎత్తుగా వున్న రైలుకట్ట దిగి లోయలా వున్న ప్రాంతానికి జారి దట్టంగా వున్న చెట్ల మధ్యకి పరిగెత్తసాగింది.

అలా పోను పోను అటవి ప్రాంతం వస్తుంది. అక్కడ చిన్న చితక జంతు జాలం వుంటాయి. అయినా ఆమె అప్పుడు ఆలోచించలేదు.

"ఆ రౌడీల నుంచి ఎలాగైనా తనని తాను



కాపాడుకోవాలి" ఒకటే లక్ష్యం.

వెన్నెల రోజులు కావటంతో దారి కనిపిస్తూ కాస్త మెరుగ్గా వుంది. అలా పరిగెడుతూనే మధ్యమధ్యలో వెనక్కి తిరిగి చూస్తూంది. వాళ్ళు ఆమె వెంట పరిగెత్తి వస్తూనేవున్నారు.ఇద్దరి మధ్య ఎంతో దూరం లేదు.

ఎగవూపిరి తన్నుకుని వస్తున్నా హిమజ పరుగు ఆపటం లేదు.

చెట్టు చేమలు గుట్టలు డొంకలు దాటుకొని అలా పరిగెడుతూనేవుంది.

కాని పోను పోను దారి సుగమంగాలేదు.

కాలు మోప వీలులేనట్లు విరిగిపడిన చెట్ల కొమ్మలు చచ్చి కుళ్ళు కంపు కొడుతున్న చిన్నా చితక జంతు కళేబరాలు,కూలిన పిట్టగూళ్ళు....

రాత్రి కావటంతో వింత వింత శబ్దాలు.. పక్షుల కూతలు గుర్తు తెలియని జంతువుల అరుపులతో అటవీ ప్రాంతం అంతా విశృంఖలంగా భయానకంగా


వుంది.

అయినా ధైర్యం చేసుకొని ముందుకి చొరబడింది.

"వాళ్ళకి కనిపించకుండా ఎక్కడైనా పొదల మాటున దాక్కోవాలి" అనుకుంటూ వేగంగా ముందుకి అడుగు వెయ్యబోయిన హిమజ పాముని తొక్కినట్లు గభాల్న ఆగిపోయింది.

ఆమె ఒళ్ళంతా జలదరించసాగింది.

అడుగు ముందుకి పడలేదు. కారణం... ఆ



ప్రాంతమంతా ఎటు చూసినా ఎత్తుగా పేరుకొన్న పాముల పుట్టలు. పెద్ద పెద్ద సొరంగాలతో భయంకరంగా వున్నాయి. అక్కడక్కడా పుట్టల మీద తెల్లటి పాము కుబుసాలు. చెట్ల సందుల నుంచి జారుతున్న వెన్నెల వెలుగులో మరింత తెల్లగా మెరుస్తున్నాయి.

ఏ మూల నుంచో పాము బుస్సు మంటున్న ధ్వని.. ఎండిన ఆకుల మీంచి జరజరా సర్రున పాకుతున్న ధ్వని..

హిమజ శరీరం మీద వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. "ఒక్క అడుగు పొరపాటున పడినా కస్సున పాము కాటెయ్యక మానదు. ఇదంతా నాగలోకంలా వుంది" అనుకుంది.

పోనీ వెనక్కి తిరిగి పోదామన్నా లేదు. ఎండిన ఆకుల మీద ఆ నల్గురూ పరిగెడుతున్న ధ్వని వినవస్తూంది.

"ఏం చెయ్యాలి?" దిక్కుతోచనిదానిలా ఆ చీకట్లో కళ్ళు చికిలించుకుంటూ చుట్టూపరికిస్తున్న హిమజ 'కెవ్వున' కేక పెట్టింది.

బరువుగా చల్లగా ఆమె మెడమీద ఏదో పై నుంచి టప్పున పడింది. భయంతో కెవ్వున కేక పెడుతూ రెండు చేతుల్తో మెడ తడుముకుంది. కాని అప్పటికే చాలా ఆలస్యంగా అయిపోయింది..

సుమారు మూడు బారల పొడుగుతో, ఏనుగు తొండం అంత లావులో నల్ల పొడలతో వున్న కొండ చిలువ బలంగా ఆమె ఒంటిని నిలువెల్లా చుట్టుకోసాగింది.

దాన్ని చూస్తూనే హిమజ పై ప్రాణాలు పైనే పోయాయి.

హిమజ కెవ్వు కెవ్వుమని అరుస్తూ నిలువెల్లా తనని చుట్టుకొంటున్న ఆ కొండ చిలువని విదిల్చుకుంటూ అటు ఇటు పరిగెత్తసాగింది. అయినా ఆ కొండ చిలువ శక్తి ముందు ఆమె గెలవలేకపోతూంది.

చాప చుట్టలా ఆమెని కింద పడవేసి నిలువెల్లా ఆమెని చుట్టుకుంటూ కొండ చిలువ భయంకరంగా నోరుతెరిచింది. తనని చుట్టేస్తూ కబళించబోతున్నఆ కొండ చిలువని రెండు చేతుల్తో బలంగా విదిలించుకుంటూ ఆ ఎండు టాకుల మీద పిచ్చిగా అటు ఇటూ పొర్లుతూ కెవ్వు కెవ్వు మని కేకలు పెడుతూ "హెల్ప్‌మీ.. రక్షించండి.. రక్షించండి" అంటూ గొంతు చించుకొని అరవసాగింది హిమజ.

** ** **

"కట్....కట్...కట్..." మూడుసార్లు గట్టిగా అరిచాడు డైరెక్టర్.

కెమెరా రీలు ఆగిపోయింది.

అంతవరకూ దేదీప్యమానంగా వెలుగుతున్న లైట్లు ఆరిపోయాయి.

పాముల నర్సయ్య గభాల్న దూకినట్లు సెట్‌మీదికి వచ్చి హీరోయిన్ హిమజని చుట్టుకొంటున్న కొండ చిలువని ఒడుపుగా లాగి బయటికి తీసుకుపోయి బోనులో పడేశాడు.

ఒంటిమీద కొండ చిలువ జారిపోయినా ఇంక నిలువెల్లా వణికిపోతూ భయంతో కేకలు పెడుతూనేవుంది హిమజ.

డైరెక్టర్ అభినందనగా ఆమె భుజం మీద కొడుతూ "బోయ్ మంచి నీళ్ళు తీసుకురా" అన్నాడు.

సెట్‌లో వున్న తక్కిన టెక్నీషియన్స్ అంతా ఆమె చుట్టు మూగి చాలా బాగా యాక్ట్ చేశారు. షాట్ బాగా వచ్చిందంట ప్రశంసలు కురిపించసాగారు.

"నిజంగా బాగా చేశావమ్మా. పాముతో తీసిన సినిమాలన్నీ సూపర్ హిట్ కావడం సినిమా చరిత్రలో ఆనవాయితి. వాన సినిమా కూడా సూపర్ హిట్. కొత్త హీరోయిన్ వయినా నీకు ఈ సినిమా మంచి బ్రేక్ ఇస్తుంది"

డైరెక్టర్ పొగడ్త హిమజ చెవికి సోకటం లేదు.ఇంక అలాగే ఒణికిపోతూ—

"షూటింగ్ సమయంలో రబ్బరు కొండ చిలువ అని చెప్పారు కదా.. కాని..." అంది కంపిస్తున్న గొంతుకతో.

"నిజమే. అలాగే చెప్పాం" కాని ఒరిజనాలిటి కోసం. సీన్ ఎఫెక్టివ్‌గా రావటం కోసం లాస్ట్ మూమెంటులో.. నిజంగ కొండ చిలువే తెప్పించమని.. ప్రొడ్యూసర్ గారు పట్టుబట్టారు... అం...దు..."

డైరెక్టర్ ఓదార్పు చెవికి ఎక్కటం లేదు. హిమజకి ఇంక అలాగే ఒణికిపోతూ ఒళ్ళంతా చెమటతో తడిసి పోతుంటే నిస్త్రాణగా కుర్చీలో కూలబడి అరచేతిని ముఖానికి అడ్డం పెట్టుకొంది. వర్థమాన హీరోయిన్ హిమజ.